సాక్షి పెద్దపల్లి

మంగళవారం। 5। సెప్టెంబర్। 2023



ఎన్‌హెచ్‌ఎం వర్కర్ల వంటావార్పు

పెద్దపల్లిరూరల్‌:తమను పర్మినెంట్‌ చేయాలని ఎన్‌హెచ్‌ఎం స్కీం వర్కర్ల సమ్మె నాలుగోరోజుకు చేరింది. జిల్లాకేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద వంటావార్పు చేశారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

ప్రజావాణిలో ప్రజలు అందించిన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని అడిషనల్‌ కలెక్టర్‌ శ్యాంప్రసాద్‌లాల్‌ అన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
30.0 /22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. చలిగాలులు కొనసాగుతాయి.



జీవితంలో తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులదే.. భవిష్యత్‌కు మార్గదర్శకులు.. మనకు విద్యాబుద్ధులు నేర్పి, సన్మార్గంలో నడిచేలా చూడటంలో వారి పాత్ర కీలకం. ఏటా ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు సాధిస్తూ ఎంతో ఎత్తుకు ఎదిగినా ఉపాధ్యాయులు మాత్రం అక్కడే ఉండిపోతారు. తమ శిష్యులు ఉన్నత స్థాయిలో ఉండాలని మాత్రమే కోరుకునే నిస్వార్థపరులు. అది జరిగిన రోజు వారికి కలిగే ఆనందం మరెందులోనూ కలగదు. మనం ఎక్కడున్నా అలాంటి టీచర్లను గుర్తు చేసుకోవాలి. మన దేశ మాజీ రాష్ట్రపతి డాక్టర్‌ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ జయంతిని పురస్కరించుకొని ఏటా సెప్టెంబర్‌ 5న ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఆయన ఉపాధ్యాయ వృత్తి నుంచి దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన మహనీయుడు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయుల సేవలపై 'సాక్షి' కథనం.

గురుభ్యోనమః

- భవిష్యత్‌కు మార్గదర్శకులు
- జీవితంలో తల్లిదండ్రుల తర్వాత స్థానం టీచర్లదే
- విద్యార్థుల ఉన్నతిని కోరుకునే నిస్వార్థపరులు
- ఏ స్థాయిలో ఉన్నా వారిని గుర్తుంచుకోవాలి

ఈ ప్రపంచంలో ఎన్ని వృత్తులు ఉన్నా.. వారందరినీ తయారు చేసేది ఉపాధ్యాయ వృత్తే. అందుకే ఆ వృత్తి అంటే నాకు ఎంతో గౌరవం.
– అబ్దుల్‌ కలాం



ప్రభుత్వ బడికి జీవం



చార్ట్‌తో బోధిస్తున్న హెచ్‌ఎం సురేశ్‌

కథలాపూర్‌(వేములవాడ): సిరికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2013–14లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 68 మంది విద్యార్థులు ఉన్నట్లు రికార్డుల్లో నమోదవగా.. 28 మందే బడికి వచ్చేవారు. ఆ సమయంలో హెచ్‌ఎంగా చింత సురేశ్‌ బదిలీపై వచ్చారు. పాఠశాల మూతబడే ప్రమాదముందని టీచర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని, ఇంగ్లిష్‌ మీడియంలో విద్యనందిస్తామని ప్రచారం చేశారు. దీంతో విద్యార్థుల సంఖ్య 130కి చేరింది. టీచర్లు బొమ్మల ద్వారా పాఠాలు బోధిస్తున్నారు. బడికి జీవం పోశారని స్థానికులు అభినందిస్తున్నారు.



ఆకర్షణీయమైన చిత్రాలతో..

వాల్‌ పెయింటింగ్‌ ద్వారా బోధిస్తున్న సరిత

ఇల్లందకుంట(హుజూరాబాద్‌): బూజునూర్‌ ఎంపీపీఎస్‌ ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న మాతంగి సరిత జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. బడి గోడలపై ఆకర్షణీయమైన చిత్రాలు వేయించి, సులభ పద్ధతిలో పాఠాల బోధనకు చర్యలు తీసుకుంటున్నారు. వసతులు కల్పించడం వల్ల విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

ఇంగ్లిష్‌లో వందశాతం ఉత్తీర్ణత



రామడుగు(చొప్పదండి): రుద్రారం హైస్కూల్‌ ఇంగ్లిష్‌ టీచర్‌ కేతు.శ్రవణ్‌కుమార్‌ విద్యార్థులు ఇంగ్లిష్‌ భాషపై పట్టు సాధించేలా పాఠాలు బోధిస్తున్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయన చొరవతో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పలు పోటీల్లో విద్యార్థులు అవార్డులు సాధించారు. అలాగే పాఠశాలలో గత ఐదేళ్లుగా పదోతరగతి విద్యార్థులు ఇంగ్లిష్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చూస్తున్నారు.

ఉచిత శిక్షణ కార్యక్రమాలు



పాఠాలు బోధిస్తున్న రమేశ్‌

ధర్మపురి: ధర్మపురికి చెందిన కాశెట్టి రమేశ్‌ దోనూర్‌ ఎంపీపీఎస్‌లో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. మన ఊరు–మన బడి పనులను మొదటి విడతలో పూర్తి చేసి, హరితహారంలో భాగంగా బడిలో మొక్కలు నాటించారు. ఈ ఏడాది ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. 2006 నుంచి నిరుద్యోగులకు ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించగా పలువురు ఉద్యోగాలు సాధించారు.

క్షేత్ర, వైజ్ఞానిక ప్రదర్శనలు



వరినాటు వేస్తున్న అభయ్‌ రాజ్‌

రాయికల్‌(జగిత్యాల): రామారావుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అభయ్‌రాజ్‌ విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి చేశారు. ప్రస్తుతం 50 మంది ఉన్నారు. పిల్లలను క్షేత్ర, వైజ్ఞానిక ప్రదర్శనలకు తీసుకెళ్లి, అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులో 25 డిజిటల్‌ పాఠాలకు రూపకల్పన చేశారు. మంగళవారం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకోనున్నారు.

'బడిబాట'లో విస్తృత ప్రచారం



శ్రీనివాస్‌..

జమ్మికుంట(హుజూరాబాద్‌): మాచనపల్లి ప్రాథమికోన్నత పాఠశాల టీచర్‌ యేబూషి శ్రీనివాస్‌ బాడిబాట కార్యక్రమంలో విస్తృత ప్రచారం చేశారు. విద్యార్థుల సంఖ్యను 65 నుంచి 117కు పెంచారు. మన ఊరు–మన బడి కార్యక్రమంతో పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. విద్యార్థులకు ఆటపాటలతో విద్యనందిస్తున్నారు. శ్రీనివాస్‌ జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

తెలుగు భాషకు ప్రాధాన్యం



బిందు మాధవి..

ముస్తాబాద్‌(సిరిసిల్ల): తెలుగు భాషను బతికించేందుకు బందనకల్‌ జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు టీచర్‌ బిందు మాధవి కృషి చేస్తున్నారు. విద్యార్థులు తెలుగులో 10 జీపీఏ సాధించడమే ఇందుకు నిదర్శనం. తెలుగు వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో ఇక్కడి విద్యార్థులు రాణించారు. అనేక పద్యాలు రాశారు. బిందు మాధవి సేవలను గుర్తించి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేశారు.

రాష్ట్రస్థాయి మూడో ర్యాంక్‌



పవన్‌కుమార్‌..

హుజూరాబాద్‌రూరల్‌: చెల్పూర్‌ హైస్కూల్‌ సోషల్‌ టీచర్‌ ఆర్‌.పవన్‌కుమార్‌ విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. రాష్ట్రస్థాయి సోషల్‌ స్టడీస్‌ ప్రతిభా పరీక్షలో ఈ స్కూల్‌ విద్యార్థి మూడో ర్యాంక్‌ సాధించాడు. జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో మొదటి స్థానం సాధించారు. పవన్‌కుమార్‌ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు ఎంపికయ్యారు.

విద్యార్థులకు అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి

జూలపల్లి(పెద్దపల్లి): వడ్కాపూర్‌ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కరుణాకర్‌ రెడ్డి చిన్నారులకు సులభమైన పద్ధతిలో విద్యాబోధన చేస్తున్నారు. స్కూల్లో చేరిన చిన్నారులకు పాఠశాల ఆవరణలోనే అక్షరాభ్యాసం చేయిస్తున్నారు. బడిలో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో ముందు వరుసలో నిలిచారు.

బడిని బతికించారు..



సుధాకర్‌..

మెట్‌పల్లి(కోరుట్ల): సింగపూర్‌ ప్రాథమిక పాఠశాల 2014లో మూతపడింది. ఇక్కడి ఉపాధ్యాయుడు సుధాకర్‌ డిప్యుటేషన్‌పై మరో పాఠశాలకు వెళ్లారు. ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమ విద్యను ప్రవేశపెట్టడంతో గతేడాది పాఠశాల తెరుచుకుంది. ఆయన పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరడంతో వారు అంగీకరించారు. ప్రస్తుతం 15 మంది చదువుతున్నారు.

జగ్గయ్యపల్లి ప్రాథమిక పాఠశాల..



షబానా..

కాల్వశ్రీరాంపూర్‌(పెద్దపల్లి): ఆరేళ్ల మూతపడిన మల్యాల జగ్గయ్యపల్లె పాఠశాలను గతేడాది తిరిగి ప్రారంభించారు. టీచర్‌ షబానా గ్రామస్తులతో మాట్లాడి, ఒప్పించడంతో 5 తరగతులు 11 మంది విద్యార్థులతో కొనసాగుతున్నాయి. ఆమె ఒక్కరే ఇంగ్లిష్‌ మీడియంలో పాఠాలు బోధిస్తున్నారు. ఆటపాటలతో బోధన చేస్తూ మధ్యాహ్నం మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారు.

స్కూల్‌కు అవార్డు..



పిల్లలతో ఉపాధ్యాయురాలు మమత

సైదాపూర్‌: మండల కేంద్రానికి చెందిన మారవేని మమత అమ్మనగుర్తి పీఎస్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. రూ.20 వేలతో ఎల్‌ఈడీ టీవీ, రూ.5 వేలతో కుర్చీలు సమకూర్చారు. వ్యాయామం, ఆటపాటలతో విద్యనందిస్తున్నారు. టీఎల్‌ఎం 2022–23కు మండల స్థాయిలో పాఠశాలకు ఉత్తమ అవార్డు వచ్చింది. మమత కృషికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు వరించింది.

విద్యతోపాటు క్రీడల్లో ప్రోత్సాహం



శేఖర్‌ మల్లేశం సదానందం భాస్కర్‌

సిరిసిల్లఎడ్యుకేషన్‌/ఇల్లంతకుంట/ముస్తాబాద్‌(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్‌ పాఠశాల ఇంగ్లిష్‌ టీచర్‌ గొట్టిముక్కల శేఖర్‌ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. పాఠశాల నుంచి 15 మంది రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌ పోటీలకు, నలుగురు నేషనల్‌ లెవెల్‌ ఫుట్‌బాల్‌ పోటీలను ఎంపికవడంలో శేఖర్‌ కృషి ఎంతో ఉంది. పిల్లలను విద్యతోపాటు క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని జవారీపేట ప్రాథమిక పాఠశాల టీచర్‌ అరుకుటి మల్లేశం శిథిలావస్థలో ఉన్న బడిని బాగు చేయించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. రామోజీపేట పాఠశాల టీచర్‌ రెవోజు సదానందం రెగ్యులర్‌ విద్యతోపాటు విద్యార్థులకు కంప్యూటర్‌ విద్యనందించడానికి కృషి చేశారు. డిజిటల్‌ బోధనకు రాత్రింబవళ్లు శ్రమించి యూట్యూబ్‌ ఛానల్‌ ద్వారా వీడియో పాఠాలు రూపొందించగా మంత్రి కేటీఆర్‌ అభినందించారు. సదానందం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ముస్తాబాద్‌ మండలంలోని కొండాపూర్‌ జెడ్పీ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు నాయిని భాస్కర్‌ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. పదేళ్లుగా ఆయన విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు.

అత్యుత్తమ శిక్షణ



క్రీడలపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్‌

జమ్మికుంట(హుజూరాబాద్‌): వావిలాల జెడ్పీహెచ్‌ఎస్‌ వ్యాయమ ఉపాధ్యాయుడు జిట్టబోయిన శ్రీనివాస్‌ విద్యార్థులకు క్రీడల్లో అత్యుత్తమ శిక్షణనిస్తున్నారు. దీంతో జిల్లాస్థాయి ఖోఖో, కబడ్డీ, హ్యాండ్‌బాల్‌ క్రీడల్లో రాణిస్తున్నారు. ఆయన జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

ప్రొజెక్టర్‌ ద్వారా విద్యాబోధన



మానకొండూర్‌: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల టీచర్‌ ఆరెపల్లి జయప్రద గౌతమి ప్రొజెక్టర్‌ ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. దీంతో పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలలకు వెళ్తున్నారు. ప్రభుత్వం ఆమెను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసింది.

'పది'లో ఉత్తీర్ణతకు ప్రణాళికలు



పదోతరగతిలో విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యేలా ప్రణాళికలు రూపొదించి, సక్సెస్‌ అయ్యాం. గతేడాది ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్‌ ఐటీలో సీటు పొందారు. – పి.కృష్ణగోపాల్‌, హెచ్‌ఎం

విద్యార్థుల ఉన్నతే లక్ష్యం



విద్యార్థులు పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేలా తీర్చిదిద్దుతున్నాం. 2022–23 ఏడాది పదోతరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాం
– పి.వేణుగోపాల్‌రావు, గణిత టీచర్‌, జెడ్పీహెచ్‌ఎస్‌, ఎలగందుల

క్రీడల్లో రాణించేలా..



పిల్లలను క్రీడల్లో భాగస్వాములను చేస్తున్నాం. చాలామంది కబడ్డీ, వాలీబాల్‌ క్రీడల్లో రాణించారు. పలువురు కానిస్టేబుల్‌, ఎస్సై, పీఈటీ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.
– సత్తినేని రమేశ్‌కుమార్‌, పీఈటీ

హ్యాండ్‌బాల్‌ క్రీడలో పతకాలు



హ్యాండ్‌బాల్‌ క్రీడకు కేరాఫ్‌గా గుల్లకోటను తీర్చిదిద్దాం. నా కెరీర్‌లో ఆరుగురు విద్యార్థులు జాతీయ పోటీల్లో బంగారు పతకాలు సాధించడం, నలుగురు సాయ్‌ అకాడమీకి ఎంపికవడం మర్చిపోలేను.– జి.శ్రీనివాస్‌, పీఈటీ

– సప్తగిరికాలనీ(కరీంనగర్‌)

కొత్త ఓటర్లు @6,730

- ఓటరుగా నమోదైన యువత
- చర్యలు చేపట్టిన ఎన్నికల సంఘం
- ముగిసిన ఓటరు నమోదు శిబిరాలు



నమోదు పరిశీలిస్తున్న తహసీల్దార్‌ మధుసూదన్‌రెడ్డి

సుల్తానాబాద్‌: జిల్లాలో యువ ఓటర్లు పెరిగారు. ఓటరు నమోదుకు జిల్లావ్యాప్తంగా రెండోరోజుల పాటు ప్రత్యేకంగా నిర్వహించిన శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. ఈ శిబిరాల్లో నూతన ఓటర్ల నమోదు, కార్డులో వివరాల నమోదు, చేర్పులు, మార్పుల కోసం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్థానిక అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఈ లెక్కన జిల్లాలో కొత్తగా 6,730 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించడంతోపాటు తప్పులు లేకుండా ఓటర్‌ జాబితా రూపొందించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు నూతన ఓటరుగా నమోదుకు ఈనెల 19వరకు అవకాశం ఉండడంతో వారి సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. దీనిపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం చేపడుతోంది. శని, ఆదివారాల్లో నూతన ఓటరు నమోదుకు ఫాం–6 ద్వారా 6,730, ఓటరు కార్డు వివరాల నమోదుకు ఫాం–7 ద్వారా 1,099, ఓటరు కార్డులో వివరాల మార్పులకు ఫాం–8 ద్వారా 2,343 దరఖాస్తులు అందాయని ఎన్నికల నాయబ్‌ తహసీల్దార్‌ ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు.

నియోజకవర్గం	దరఖాస్తుదారులు
పెద్దపల్లి	2,746
మంథని	2,510
రామగుండం	1,474

ప్రణాళికతో ముందుకు..

ప్రత్యేక శిబిరాలను విజయవంతం చేసేందుకు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు బూత్‌స్థాయిలో పర్యటించేలా ప్రణాళిక రూపొందించారు. బీఎల్‌వోలు పోలింగ్‌ కేంద్రాల్లో ఉండి దరఖాస్తులు స్వీకరించారు. వీరిపై పర్యవేక్షణకు సూపర్‌వైజర్లను నియమించారు.

అర్హులంతా ఓటర్లుగా నమోదు కావాలి

జిల్లాలో ఓటరు నమోదు అధిక శాతం జరగాలని ఎన్నికల అధికారి, కలెక్టర్‌ ముజామ్మిల్‌ఖాన్‌ పేర్కొన్నారు. ఓటరు నిబంధనలకు అనుగుణంగా శిబిరాలు నిర్వహించామని తెలిపారు. అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలని సూచించారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌కు చివరి ఎన్నికలు



మాట్లాడుతున్న మోహన్‌జోషి. చిత్రంలో డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌, విజయరమణారావు, తదితరులు

- కాంగ్రెస్‌ కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి
- పార్టీ పార్లమెంట్‌ ఇన్‌చార్జి మోహన్‌జోషి

పెద్దపల్లిరూరల్‌: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ పార్టీ అక్రమ పద్ధతుల్లో అధికారం దక్కించుకునేందుకు కుట్ర పన్నుతోందని, వాటిని తిప్పికొట్టేందుకు కాంగ్రెస్‌ కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలని పార్టీ పార్లమెంట్‌ ఇన్‌చార్జి మోహన్‌జోషి అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ రాజ్‌ఠాకూర్‌ అధ్యక్షతన జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్‌ ప్రభుత్వాలు ప్రజల విశ్వాసం కోల్పోయాయని, వాటికి ఈ ఎన్నికలే చివరివి అని తెలిపారు. రైతు సంక్షేమం అంటూ రైతులనే మోసం చేసిన ఘనుడు సీఎం కేసీఆర్‌ అని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఏకకాలంలో రుణమాఫీ చేసిన మహానీయుడు వైఎస్సార్‌ అని, ఆ ఘనత కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. నాయకులు గోమాస శ్రీనివాస్‌, ఈర్ల కొమురయ్య, శశిభూషన్‌కాచే, అన్నయ్య, సారయ్య, తిరుపతి, స్వామి, వరప్రసాద్‌, మస్రత్‌, సురేశ్‌గౌడ్‌, దామోదర్‌, అవినాశ్‌, జెమినిగౌడ్‌, సతీష్‌, జగదీశ్‌, సుభాష్‌రావు, సంపత్‌, చెవుల తిరుపతి, శోభ, ఈర్ల స్వరూప, అర్కుటి సంతోష్‌ తదితరులున్నారు.



కె.శ్రీనివాస్‌, మండల అధ్యక్షుడు



బి.సురేశ్‌గౌడ్‌, పట్టణ అధ్యక్షుడు

పార్టీ బలోపేతానికి పాటుపడాలి: మక్కాన్‌సింగ్‌

జిల్లాలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని మండలాలు, పెద్దపల్లి, సుల్తానాబాద్‌ పట్టణ అధ్యక్షులను నియమించారు. పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడిగా బి.సురేశ్‌గౌడ్‌, సుల్తానాబాద్‌ పట్టణ అధ్యక్షుడిగా అబ్బయ్యగౌడ్‌ను నియమించారు. పెద్దపల్లి మండల అధ్యక్షుడిగా కడార్ల శ్రీనివాస్‌, ఎలిగేడుకు సామ రాజేశ్వర్‌రెడ్డి, జూలపల్లికి శ్రీనివాస్‌, సుల్తానాబాద్‌కు చిలుక సతీశ్‌, ఓదెలకు మూల ప్రేంసాగర్‌రెడ్డి, కాల్వశ్రీరాంపూర్‌కు సదయ్యయాదవ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడాలి



విగ్రహ ప్రతిష్ఠాపనలో పరబ్రహ్మానందగిరి స్వామి

పాలకుర్తి: సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు హిందువులు పాటుపడాలని పరంధామఆశ్రమం పంచముఖ హన్‌మాన్‌ పీఠం కరీంనగర్‌కు చెందిన పరబ్రహ్మానందగిరి స్వామిజీ అన్నారు. బసంత్‌నగర్‌ సమీపంలోని కురుమపల్లిలోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో గ్రామానికి చెందిన విశ్వహిందూ పరిషత్‌ నాయకులు బీటీ శేఖర్‌ ఏర్పాటు చేసిన ఏడు ఫీట్ల హన్‌మాన్‌ విగ్రహ ప్రతిష్ఠాపనకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భక్తులకు ప్రవచనాలు బోధించారు. తల్లిదండ్రులు చిన్నతనం నుంచే పిల్లలకు సనాతన ధర్మాన్ని బోధించాలన్నారు. బీజేపీ నాయకుడు గొట్టిముక్కల సురేష్‌రెడ్డి, నల్ల ఫౌండేషన్‌ అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి హాజరై ఆంజనేయస్వామికి పూజలు చేశారు. ఆలయ పూజారి రఘునాథ్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ భూతగడ్డల నర్సయ్య, సర్పంచ్‌ మామిడిపల్లి బాపయ్య, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు స్వరూప్‌కిరణ్‌గౌడ్‌, నాయకులు నాగుల మల్లాల సత్యం, మహేందర్‌, గజ్జెల శ్రావణ్‌ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు 'ఉన్నతి'పై శిక్షణ

రామగుండం:బోధనలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఉన్నతి' కార్యక్రమం ద్వారా శిక్షణ ఇస్తోందని కోర్స్‌ డైరెక్టర్‌ తానం స్వర్ణ, మండల నోడల్‌ ఆఫీసర్‌ జి.భవానీ అన్నారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు భాషా సామర్థ్యాలు – అభ్యసనా ఫలితాలు సాధించడంలో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం ప్రొజెక్టర్‌ ద్వారా ఆధునిక బోధన పద్ధతులపై రామగుండం, అంతర్గాం, పాలకుర్తి, మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్‌ మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌ పర్సన్స్‌ కుంట వెంకటేశం, వాసంతి, వెంకటలక్ష్మి, తిరుపతి, క్లస్టర్‌ రిసోర్స్‌పర్సన్‌ గౌస్‌ తదితరులున్నారు.

ఇన్‌స్పైర్‌మానక్‌ నమోదు గడువు పొడిగింపు

పెద్దపల్లిరూరల్‌: విద్యార్థుల్లోని వినూత్న ఆలోచనలను వెలికితీసేందుకు కేంద్రప్రభుత్వం ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్‌మానక్‌ అవార్డుల నామినేషన్ల గడువును ఈనెల 30 వరకు పొడిగించినట్లు డీఈవో మాధవి తెలిపారు. జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌ ద్వారా తమ ప్రాజెక్టుల వివరాలు, వ్యక్తిగత వివరాలను నమోదు చేసేలా పాఠశాలల యాజమాన్యాలు చొరవ చూపాలని సూచించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థికి రూ.10వేలను డీబీటీ ద్వారా నేరుగా అందుకుంటారని వివరించారు. ఇప్పటివరకు పేర్లు నమోదు చేయని పాఠశాలల నుంచి ఐదుగురు విద్యార్థులకు అవకాశం ఉంటుందని, వివరాలకు జిల్లా సైన్స్‌ అధికారి బి.రవినందన్‌రావును సెల్‌ నంబర్‌ 99515 04622లో సంప్రదించాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ముదిరాజ్‌లకు టికెట్లు కేటాయించాలి


సమావేశంలో జేఏసీ నాయకులు

గోదావరిఖని: ముదిరాజ్ కులస్తులకు అసెంబ్లీ టికెట్లు ఇవ్వాలని ముదిరాజ్ జేఏసీ రాష్ట్ర నాయకులు ఉష్కం శ్రీనివాస్, పిడుగు కృష్ణ, నాయిని మధునయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన 115మంది అభ్యర్థుల్లో ఒక్కరూ ముదిరాజ్ లేరని పేర్కొన్నారు. జాతి ఐక్యతను దెబ్బతీసే కుట్రలు చేస్తున్న ఏపార్టీకైనా రానున్న రోజుల్లో గుణపాఠం తప్పదన్నారు. నాయకులు అప్పరాజు ప్రభాకర్, నూనె రాజేశం, బర్ల మల్లయ్య, తూడి రాజయ్య, పిట్టల హనుమండ్లు, రావుల స్వరాజ్, పిట్టల కొమురయ్య, అయిలవేన రాజేందర్, గొడుగు రవి, ఓదల రామస్వామి, చొప్పరి రాయమల్లు, తదితరులు పాల్గొన్నారు.

‘ట్రినిటి’లో ఓరియంటేషన్ డే


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం ఓరియంటేషన్ డే నిర్వహించారు. ప్రస్తుతం సమాజంలో నెలకొన్న పోటీని ఎదుర్కొని నిలబడితేనే ఉద్యోగావకాశాలు దక్కుతాయని జేఎన్‌టీయూ హెచ్‌ఓడీ సతీశ్, మోటివేషన్ స్పీకర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశన్, ఏఓ సురేశ్, రాజిరెడ్డి, నటరా జన్, స్వాతి, ప్రభాకర్, పద్మిని తదితరులున్నారు.

ఏడో తేదీ వరకు భారీ వర్షాలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో మరో మూడురోజులు భారీ వర్షాలు కురువనున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా ఈనెల 7వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సోమవారం వెల్లడించింది. ఆమేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మంగళవారం జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో అతి భారీ వర్షాలు కురుస్తాయని, సిరిసిల్లలో భారీవర్షాలు కురుస్తాయని తెలిపింది. బుధవారం రాజన్న సిరిసిల్ల, జగిత్యాలలో అతిభారీ వర్షాలు, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని వివరించింది. గురువారం మాత్రం ఎల్లో అలర్ట్ ఉంటుందన్నారు. ఆరోజు కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.

జనారణ్యంలోకి నక్క

రుద్రంగి(వేములవాడ): అటవీ ప్రాంతం నుంచి సోమవారం ఓ నక్క జనావాసంలోకి వచ్చింది. మండల కేంద్రంలోని దరిపెల్లి మహేశ్ ఇంట్లో నక్క చొరబడింది. సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు నక్కను బంధించి సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలేశారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బాలకృష్ణ, సిబ్బంది శంకర్ ఉన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

- అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్


అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్

పెద్దపల్లిరూరల్: ప్రజావాణిలో ప్రజలు అందించిన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదులను సంబంధిత అధికారులకు బదలాయించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయన్నారు. వచ్చిన ఫిర్యాదులు మళ్లీమళ్లీ రాకుండా చూడాలన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన తనకు ఉపాధి చూపాలని పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేటకు చెందిన ఆంజనేయులు అర్జీ ఇచ్చారు. తాము కొనుగోలు చేసిన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయడంలేదని గోదావరిఖనికి చెందిన చిగురు భాగ్యలక్ష్మి మొరపెట్టుకుంది. కార్యక్రమంలో పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ డబ్బులు చెల్లించండి

పాలకుర్తి: ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన పాలకుర్తి మండలం వేంనూర్ గ్రామస్తులకు రావాల్సిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పెండింగ్ డబ్బులు చెల్లించాలని గ్రామస్తులు శ్యాంప్రసాద్ లాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. 2010లో ప్యాకేజీకి మొదటి విడత 819 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారని, వారిలో 84మందికి చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయని, 2012లో రెండోవిడత 292 మందికి 136 మందికి స్టూడెంట్ ప్యాకేజీ ఇచ్చారని, ఇంకా 156 మందికి ఇవ్వాల్సి ఉందని గ్రామస్తులు సత్తయ్య, మేరుగు సునంద, మేకల లక్ష్మి, సుమన్, కొడిపెల్లి శ్రీనివాస్, కార్తీక్, గుమ్ముల శ్రీనివాస్, పొన్నం సంజీవ్, బోరె సతీశ్ కోరారు.


జాయింట్ కలెక్టర్‌కు విన్నవిస్తున్న వేంనూర్ గ్రామస్తులు

‘బలగం’ మొగిలయ్య–కొమురమ్మకు సన్మానం


చెక్కు అందిస్తున్న సర్పంచ్ మీసాల అంజయ్య

తిమ్మాపూర్: బలగం మూవీలో క్లైమాక్స్ పాట పాడిన మొగిలయ్య–కొమురమ్మను రామకృష్ణ కాలనీ సర్పంచ్ మీసాల అంజయ్య, బేడ బుడగజంగాల కమిటీ సభ్యులు సోమవారం సత్కరించి రూ.పదివేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా మొగిలయ్య మాట్లాడుతూ.. బలగం సినిమాతో ఎంతో పేరు వచ్చిందన్నారు. బేడ బుడగ జంగాలను గుర్తించి తగిన ప్రాధాన్యం కల్పించాలని, సీఎం కేసీఆర్ బేడ బుడగజంగాలను ఆదుకోవాలని కోరారు. అనంతరం సర్పంచ్ మీసాల అంజయ్యకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రణీత్‌రెడ్డి, వార్డు సభ్యులు తూర్పాటి అజయ్, అల్వాల సంపతి, కిన్నెర సంపతి, యూత్ ప్రెసిడెంట్ కిన్నెర అంజి, ఇనుకొండ సంపత్, ఇనుకొండ నరేశ్, ఓబుది శీను, ఇరునాల రమేశ్, గంధం శీను, ఇనుకొండ సంపత్, అంజి, గంధం సారయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షం ధాటికి కూలిన ఇల్లు


ఎలిగేడు: ధూళికట్టలో కూలిన ఇల్లు


రామగుండం: వరద నీటిలో గుర్రపు డెక్క

ఎలిగేడు/ధర్మారం/రామగుండం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామానికి చెందిన జక్కుల ప్రమీల ఇల్లు కూలిపోయింది. కూలిన ఇంటిని ఆర్‌ఐ శైలజ సందర్శించి నష్టం వివరాలను నమోదు చేసకున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరతున్నారు. ధర్మారం మండలంలో ఆది, సోమవారాల్లో వర్షం పడుతూనే ఉండటంతో ప్రజలు ఇంటికే పరిమితమైనారు. కాగా పత్తి, మొక్కజొన్న పంటలకు ఈ వర్షం ఉపయోగకరంగా మారడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రామగుండంలోని రాజీవ్ రహదారిపై వరద నీరు భారీగా నిలిచిపోయింది. వాహనాల రాకపోకలు ఇబ్బందులు ఎదురయ్యాయి. రహదారి లోతట్టులో ఉండడంతో చిన్నపాటి వర్షానికే నీరు నిలుస్తోందని, అందులో గుర్రపుడెక్క పెరుగుతోందని స్థానికులు అంటున్నారు.

సంక్షేమం చూసే బీఆర్‌ఎస్‌లో చేరికలు


కండువా కప్పుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి


పార్టీలో చేరిన వారితో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

కాల్వశ్రీరాంపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చే పలువురు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. మండలకేంద్రానికి చెందిన పలువురు బీ ఆర్ ఎస్‌లో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో రైతు సమితి మండల కో–ఆర్డినేటర్ దేవయ్య, ఎంపీటీసీ మాదాసు సువర్ణ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం

పెద్దపల్లిరూరల్: మహిళల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. వీఓఏలకు గౌరవవేతనం పెంచినందుకు జిల్లాకేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

పోచమ్మతల్లికి పూజలు

మండలంలోని తుర్కలమద్దికుంటలో పోచమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. గ్రామంలోని బొడ్రాయి వద్ద మొక్కులు సమర్పించారు. రూ.1.15 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను సర్పంచ్ జయప్రద, వైస్ ఎంపీపీ రాజయ్యతో కలిసి ప్రారంభించారు. నాయకులు నర్సింగ్, గోపాల్‌రెడ్డి, సురేశ్, రాము, సంపత్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, మల్లేశ్, కిష్టయ్య, రాజయ్య, లక్ష్మయ్య తదితరులున్నారు.

మంథని నియోజకవర్గంలో..

మంథని: మంథని నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. పట్టణంలోని అంబేడ్కర్‌నగర్, ఖానాపూర్, కాటారం మండలం విలాసాగర్‌కు చెందిన సుమారు 150 మంది పార్టీలో చేరగా.. వారికి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మండలంలోని విలోచవరంలో డీఆర్‌డీవో ఆధ్వర్యంలో రూ.5లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పిండి గిర్నీని మధు ప్రారంభించారు.

జీజీహెచ్ కిటకిట

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) రోగులతో కిటకిటలాడింది. సోమవారం ఏకంగా 790 మంది ఆస్పత్రికి వచ్చారు. వర్షాలతో చాలామంది జ్వరం, దగ్గు, జలుబుతో ఆసుపత్రికి వస్తుండగా.. రిసెప్షన్ కౌంటర్లు, ఓపీ విభాగాలు కిక్కిరిసిపోయాయి. ఔట్ పేషెంట్లతో వార్డులు నిండిపోయాయి. 85 పడకల కొత్త బ్లాక్ విభాగంలోని బెడ్స్‌ను ఉపయోగించడం లేదు. ఫీవర్ బ్లాక్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.


పేషెంట్లతో కిటకిటలాడుతున్న కొత్త బ్లాక్



గుట్టలను ముద్దాడిన మేఘం

రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లి, మిడ్‌మానేరు జలాశయం శివారులో ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. మేఘాలు గుట్టలను తాకుతూ కనువిందు చేశాయి. కనుచూపు మేర పచ్చని గడ్డి.. మధ్యలో మిడ్‌మానేరు నీరు.. గుట్టలపై మేఘాలు చూపరులను కట్టిపడేశాయి. – తంగళ్లపల్లి(సిరిసిల్ల)

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై నిషేధాజ్ఞలు

గోదావరిఖని: బహిరంగ ప్రదేశాల్లో మద్యం వినియోగంపై నిషేధాజ్ఞలు పొడిగిస్తున్నట్లు సీపీ రెమా రాజేశ్వరి తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ఈ నెలాఖరు వరకు అమలు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే డీజే సౌండ్స్‌పైనా నిషేధాజ్ఞలు పొడగించామని సీపీ తెలిపారు. మైక్‌సెట్ తప్పనిసరి అనిపిస్తే సంబంధిత డివిజన్ ఏసీపీల అనుమతి పొందాలని వివరించారు.

తహసీల్దార్ ఎదుట ఒకరి బైండోవర్


పోలీసుల అదుపులో నిందితుడు

రామగుండం: అంతర్గాం మండలం ముర్మూర్ గ్రామానికి చెందిన తిప్పని అంజయ్య గ్రామంలో అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు పలుమార్లు పద్ధతి మార్చుకోవాలని కౌన్సెలింగ్ ఇచ్చినా మార్పు రాకపోవడంతో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు. సోషల్ మీడియాలోనూ పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోను పోస్టు చేయడంతో సోమవారం అతడిని తహసీల్దార్ పి.రామ్మోహన్ రావు ఎదుట బైండోవర్ చేశామని, అతడిపై చట్టం ప్రకారం చర్యలు చేపడతామని ఎస్సై పేర్కొన్నారు.

జేఎన్టీయూ ఎదుట నిరసన


నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

రామగిరి: కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ.. మంథని జేఎన్టీయూ ఎదుట కాంట్రాక్ట్ అధ్యాపకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 6 నుంచి నిరవధిక సమ్మె చేస్తామన్నారు. కళాశాలకు చెందిన సుమారు 40 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు


కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న విజయరమణారావు

ఎలిగేడు: వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తీరుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని ముప్పిరితోటకు చెందిన కొందరు సోమవారం శివపల్లిలోని విజయరమణారావు నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి విజయరమణారావు కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్, బీజేపీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని, కాంగ్రెస్ పార్టీవైపు ప్రజలు, యువత ఆకర్షితులు అవుతున్నారని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని, కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, అంతటి అన్నయ్యగౌడ్, ముప్పిరితోట మాజీ సర్పంచ్ పెద్దపల్లి దేవరాజు, తదితరులు ఉన్నారు.

బొగ్గుబాయి వార్తలు

సర్క్యులర్ రద్దు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న మైనింగ్ సిబ్బంది

గోదావరిఖని/యైటింక్లయిన్‌కాలనీ/రామగిరి: సింగరేణి ఎంవీటీసీలలో కాంట్రాక్టు ఉద్యోగులు, అధికారులతో పనులు నిర్వహణకు అనుమతి ఇస్తూ యాజమాన్యం జారీ చేసిన సర్క్యులర్ రద్దు చేయాలని మైనింగ్ సిబ్బంది సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. సోమవారం రామగుండం రీజియన్‌లోని అన్ని ఏరియాల్లో నిరసన తెలిపి గని మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు. ఆర్జీ–2 ఏరియా ఓసీపీ త్రీ, వకీల్‌పల్లి, జీడీకే–7 ఎల్‌ఈపీ, ఎంవీటీసీ, ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–1,2, ఏపీఏ గనుల వద్ద మైనింగ్ సిబ్బంది నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. యాజమాన్యం జారీ చేసిన నష్టదాయకమైన, రక్షణ చర్యలకు విఘాతం కలిగించే సర్క్యులర్‌ను ఉపసంహరించే వరకు పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనింగ్ స్టాఫ్ అసోసియేషన్ కన్వీనర్ మాదాసి రామ్మూర్తి, నాగెల్లి సాంబయ్య, అనిల్‌కుమార్, డి.శ్రీనివాస్, చల్లా రవీందర్‌రెడ్డి, మహేష్, కిషన్‌రావు, సత్యనారాయణ, వెంకటేష్, సురేందర్, నాగెల్లి రమేశ్, బత్తుల రమేశ్, మామిడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటిన్యూస్ మైనర్లను వినియోగించుకోవాలి


కాన్ఫరెన్స్‌లో జీఎం శ్రీనివాస్, తదితరులు

గోదావరిఖని(రామగుండం): కంటిన్యూస్ మైనర్ యంత్రాల పనితీరుపై సంస్థ డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. బొగ్గు ఉత్పత్తి, యంత్రాల పనితీరు, లక్ష్యాల సాధనకు చేపట్టాల్సిన ప్రణాళికల గూర్చి చర్చించారు. భూగర్భ గనుల్లో కంటిన్యూస్ మైనర్ ద్వారా బొగ్గు ఉత్పత్తి కీలకమని, వాటిని సాధ్యమైనంత మేర పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ఆర్జీ–1 జీఎం మాట్లాడుతూ, జీడీకే–11గనిలో కంటిన్యూస్ మైనర్ల ద్వారా బొగ్గు కటింగ్ పరిశీలిస్తున్నామని, రక్షణ సూత్రాలను పాటిస్తూ కంటిన్యూస్ మైనర్ల ద్వారా బొగ్గు ఉత్పత్తి తీస్తున్నామన్నారు. కాన్ఫరెన్స్‌లో గ్రూప్ ఏజెంట్ చిలక శ్రీనివాస్, జాయ్ మైనింగ్ సర్వీసెస్ ప్రతినిధి శుక్లా పాల్గొన్నారు.

ఏరియర్స్ చెల్లించాలని ధర్నా


ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రామగిరి(మంథని): సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్ వెంటనే చెల్లించాలని సోమవారం ఏఐటీయూసీ నాయకులు ఆర్జీ–3 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జీఎం సుధాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కోలిండియా కార్మికులకు ఆగస్టు నెల వేతనంతో పాటు సెప్టెంబర్ 3న ఏరియర్స్ ఒకేసారి చెల్లించారని, సింగరేణి కార్మికులకు కూడా అలాగే చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసి ఏరియర్స్ ఇచ్చే తేదీలను ప్రకటించకుండా రెండు వాయిదాల్లో చెల్లిస్తామని అనడం సరికాదన్నారు. కార్యక్రమంలో వైవీ రావు, ఎంఆర్‌సీ రెడ్డి, జూపాక రాంచందర్, కందికట్ల సమ్మయ్య, రాజు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–2 జీఎంను కలిసిన టూటౌన్ సీఐ

గోదావరిఖని(రామగుండం): నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణను గోదావరిఖని టూటౌన్ సీఐ వేణుగోపాల్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఏరియాలో శాంతిభద్రతల అంశంపై చర్చించారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ

జీతం కోసం పంప్ రూంకు తాళం


పంప్ రూంకు తాళం వేస్తున్న ఆపరేటర్ భార్య

ఓదెల(పెద్దపల్లి): తనకు మూడేళ్ల జీతం చెల్లించాలని ఓదెల గ్రామపంచాయతీలో మంచినీటిని సరఫరా చేసే బావి పంప్ రూంకు ఆపరేటర్ గంగిశెట్టి రాజన్న, అతడి భార్య సోమవారం తాళం వేశారు. తాను అనారోగ్యంతో ఉన్నప్పటికీ గ్రామస్తులకు మంచినీటిని సరఫరా చేశానని, 2020 నుంచి ఇప్పటి వరకు జీతం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతం చెల్లించాలని గ్రామపంచాయతీ కార్యాలయంలో మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. జీతం డబ్బులు రూ.3లక్షల వరకు రావాలని, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో పంప్ రూంకు తాళం వేసినట్లు పేర్కొన్నారు. వెంటనే జీతం చెల్లించి తమను ఆదుకోవాలని అధికారులను కోరారు. ఈ విషయమై పంచాయతీ కార్యిదర్శి సత్యనారాయణరెడ్డిని వివరణ కోరగా.. గంగిశెట్టి రాజయ్యకు గతంలో పని చేసిన జీతం డబ్బులు చెల్లించామని, ప్రస్తుతం అతను విధులకు హాజరుకావడం లేదని తెలిపారు. పంప్‌రూంకు వేసిన తాళం తాము తీశామని, మళ్లీ వేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని కార్యదర్శి పేర్కొన్నారు.

దూషించాడని సర్పంచ్ దాడి

- చెట్టుకు కట్టేసి మరీ చితకబాదిన వైనం..?
- సర్పంచ్ కాళ్లు మొక్కి తండ్రిని తీసుకెళ్లిన కుమారుడు
- మరుసటి రోజు కూడా బాధితుడి కుమారుడికి వార్నింగ్..?
- ధర్మారం మండలంలో ఆలస్యంగా వెలుగుచూసిన సంఘటన

ధర్మారం(ధర్మపురి): వీధిలో రోడ్డు నిర్మించడం లేదని చౌరస్తాలో తనను దూషించాడన్న సమాచారంతో మండలంలోని ఓ గ్రామ సర్పంచ్ సదరు వ్యక్తిని పంచాయతీ తాత్కాలిక సిబ్బందితో మోటార్ సైకిల్‌పై ఇంటికి రప్పించుకుని చెట్టుకు కట్టేసి కొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామస్తుల బాగోగులు చూడాల్సిన సర్పంచే ఏకంగా ఓ వ్యక్తిని ఇంటికి పిలిపించుకుని కొట్టడంపై గ్రామస్తులు విస్తుపోతున్నారు. ఈ ఘటనపై మండలస్థాయి అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ తెలియనట్లు నటిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గత శుక్రవారం సాయంత్రం తమ వాడలో సర్పంచ్ రోడ్డు నిర్మించడం లేదని గ్రామ చౌరస్తాలో దూషించినట్లు సమాచారం. విషయాన్ని స్థానికుడొకరు సర్పంచ్ దృష్టికి ఫోన్‌లో చేరవేశారు. నిజాలు తెలుసుకోకుండానే కోపోద్రిక్తుడైన సదరు సర్పంచ్.. వెంటనే పంచాయతీ తాత్కాలిక ఉద్యోగికి ఫోన్ చేసి సదరు వ్యక్తిని తీసుకరావాలని హుకూం జారీ చేశాడు. సదరు ఉద్యోగి ఆ వ్యక్తిని సర్పంచు ఇంటికి తీసుకొని వెళ్లడమే ఆలస్యం.. ఆయన కుటుంబసభ్యులతో కలిసి ఇంటి ముందున్న చెట్టుకు కట్టేసి తీవ్రంగా కొట్టారు. అంతటితో ఆగకుండా సదరు వ్యక్తి కుమారుడికి ఫోన్ చేసి ‘మీ తండ్రిని చెట్టు కట్టేశాం..’ అని చెప్పారు. ఆందోళనకు గురైన బాధితుడి కుమారుడు తన మేనమామను వెంట తీసుకుని వెళ్లి చెట్టుకు కట్టేసి ఉన్న తండ్రిని చూసి చలించిపోయాడు. విడిచిపెట్టాలని సర్పంచ్‌ను కోరగా ఇష్టమొచ్చినట్లు తిడితే తాము పడతామా అని సర్పంచు కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు సర్పంచు కాళ్లు మొక్కి.. ఇకమీదట తిట్టకుండా చూస్తామని చెప్పి తండ్రిని ఇంటికి తీసుకొచ్చారు.

మరుసటి రోజు కూడా వార్నింగ్..?

చెట్టుకు కట్టేసి కొట్టిన ఘటన నుంచి తేరుకోని బాధిత కుటుంబానికి శనివారం గ్రామ పంచాయతీ నుంచి పిలుపు వచ్చింది. ఓ పెద్దమనిషి ఫోన్ చేసి పంచాయతీ కార్యాలయం వద్దకు రావాలని ఆదేశించగా.. మళ్లీ ఏం జరుగుతుందోనన్న భయాందోళనతో వెళ్లిన యువకుడికి మళ్లీ క్లాస్ పీకారు. ఇలాంటి ఘటన పునరావృతం అయితే పోలీస్‌స్టేషన్‌లో వేయిస్తానని సర్పంచు బెదిరించినట్లు సమాచారం. అక్కడే ఉన్న మిగతావారు కూడా సర్పంచును దూషించొద్దని సూచించి పంపించినట్లు సమాచారం. ఈ విషయమై బాధితుడి కుమారుడిని వివరణ కోరగా.. తన డ్రిని చెట్టుకు కట్టేసి కొట్టారని, విడిపించాలని కోరితే సర్పంచుతోపాటు ఆయన కుటుంబసభ్యులు హెచ్చరించి వదిలేశారని చెప్పాడు.